క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో జై గురుదత్త హోమం



హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో జైగురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ తదితర పూజల అనంతరం ఆలయ అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులు హోమం చేశారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

యోగాతో ఏకాగ్రత

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగాను అనుసరించడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు, యోగా శిక్షకుడు కె.జనార్దనరావు అన్నారు. గురువారం స్థానిక ఋషి యోగా కేంద్రంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా సూర్య నమస్కారాల ఆవశ్యకతను చిన్నారులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యోగాపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. యోగా సాధన వల్ల ఆరోగ్య సమస్యలను అధిగమించడంతో పాటు రోగ నిరోధక శక్తిపై పట్టు సాధించవచ్చని చెప్పారు.

ఉద్యోగాలకు ఎంపిక

పార్వతీపురం టౌన్: గాయత్రి విద్యాపరిషత్, విశాఖపట్నంలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో స్థానిక భాస్కర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు పి.జ్యోత్స్న, ఎ.హర్షిత, ఒ.విసీల, డి. వాసవిలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆ విద్యార్థినులు ఎకోహమ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలో మంచి వేతనంతో ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ బొంతు శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ ఎం.రవిశాస్త్రి, డైరెక్టర్ సురేష్, సిబ్బంది అభినందించారు.

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీతీరాన వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి గురువారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వేకువజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఉపవాసాలతో దూర ప్రాంతాల నుంచి స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను కమిటీ సభ్యులు అందజేశారు.

144 సెక్షన్ అమలులో ఉంది

సాలూరు: ఇటీవల జరిగిన ఎన్నికల నేపథ్యంలో అమలు చేసిన 144 సెక్షన్ వచ్చే నెల 4వ తేదీ వరకు, పట్టణంలో, మండలాల్లో అమలులో ఉందని, ఈ విషయం అందరూ గుర్తించుకోవాలని పట్టణ సీఐ వాసునాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని ప్రజలతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల పోలింగ్ పూర్తయిందని, ఎన్నికల ప్రక్రియ పూర్తయినట్లు కాదన్నారు. సోషల్ మీడియాల్లో, బయట గాని రెచ్చగొట్టే విధంగా ఎటువంటి మెసేజ్‌లను ఫార్వర్డ్ చేయరాదని, అందరూ సంయమనం పాటించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

సీతంపేటే కొండంత అండ..

- రెండుసార్లు వైఎస్సార్‌సీపీని గెలిపించింది గిరిజన ఓటర్లే
- ముచ్చటగా మూడోసారి విజయం ఖాయమంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సీతంపేట:

సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీ విజయం సాధించాలన్నా నిర్ణయించేది సీతంపేట మండలమే అని చెప్పుకోవచ్చు. రెండు సార్లు వరుసగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి గెలుపు వెనుక స్థానిక ఓటర్ల మద్దతు ఉందనే చెప్పుకోవాలి. మూడోసారి కూడా కళావతి గెలుపు ఖాయమని వైఎస్సార్ సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2014లో నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,64,752 కాగా పోలైన ఓట్లు 1,21,428. అప్పట్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతికి 55,337 ఓట్లు పోలవ్వగా, టీడీపీ అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు 53,717 ఓట్లు పడ్డాయి. దీంతో 1620 ఓట్ల మెజార్టీతో కళావతి గెలుపొందారు.

- 2019లో మొత్తం ఓట్లు 1,84,414కు గాను 1,36,712 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కళావతికి 72,054 ఓట్లు పోలవ్వగా, జయకృష్ణ (టీడీపీ) 54,074 ఓట్లు పోలయ్యాయి. 17,980 మెజార్టీతో కళావతి విజేతగా నిలిచారు. రెండుసార్లూ సీతంపేట ఓటర్లు కళావతికి అండగా నిలిచారు. ఈ సారి జనసేనకు వైఎస్సార్‌సీపీకి మధ్య పోటీ ఉండడంతో కళావతి గెలుపు నల్లేరుపై నడకేనని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,95,020 మంది కాగా వీరిలో 1,46,781 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇందులో సీతంపేట మండలంలో మొత్తం ఓట్లు 45,195 కాగా 36,192 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.



కోడిశలో ఓటు వేయడానికి క్యూలో నిలుచున్న ఓటర్లు (ఫైల్)

గ్రామం పేరు	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు
దిబ్బగూడ	876	664
సోమగండి	868	619
అక్కన్నగూడ	672	487
కిరప	412	368
హడ్డుబంగి	1064	651
ఉప్పరజమ్మి	527	437
చింతాడ	447	315
కొండాడ	824	515
బెనరాయి	744	531
పులిపుట్టి	706	539
ముకుందాపురం	679	573
మర్రిపాడు	1222	906
చిన్నబగ్గ	1008	731
గోరపాడు	591	470
పూతికవలస	709	611
తుంబలి	411	291
చావిడివలస	676	550
గుమ్మడ	254	207
గాటిగుమ్మడ	217	205
దబర	98	94
కోసంగి	171	155
దంజుపాయి	148	131
తుంబకొండ	330	279
రామానగరం	388	336
కిల్లాడ	445	359
దారపాడు	542	417
గాడిదపాయి	321	297
దోనుబాయి	798	671
పెద్దతంకిడి	209	188
దాసుగుమ్మడ	163	151
కె.వీరఘట్టం	321	270
పెద్దపొల్ల	462	401
తాడిపాయి	378	332
జయపురం	241	230
నాయకమ్మగూడ	325	260
గడికారెం	193	178
గడిగుజ్జి	184	176
దుగ్గి	360	340
వెలగాపురం	287	255
కొత్తకోట	241	227
మానాపురం	339	312
కుసుమూరు	449	392
టిటుకుపాయి	277	260
సామరెల్లి	328	288
పుబ్బాడ	323	301
జల్లార	296	281
సీది	438	409
గుజ్జి	262	240
పెద్దపల్లంకి	207	178
చిన్నపల్లంకి	162	153
బర్న	220	202
పెదరామ	1006	702
నాగూడ	237	228
కోపువలస	120	102
కారెంగూడ	392	358
దేవనాపురం	502	412
వంబరెల్లి	343	270
జగతపల్లి	587	445
అంటికొండ	549	455
కురసింగి	276	257
పెద్దకంబ	144	139
కుడ్డపల్లి	980	719
చిన్నకంబ	322	300
బుడగరాయి	188	175
మండ	665	600
జొనగ	522	443
సీతంపేట	2340	1513
పెద్దూరు	454	392
పాతపనుకువలస	453	354
వలగెడ్డ	392	336
గొయిది	549	455
జక్కరవలస	229	216
ఇసుకగెడ్డ	231	177
దిగువదరబ	288	246
శిలిగాం	545	428
కుశిమి	599	511
తాలాడ	801	623
మల్లి	359	322
సార	192	181
వజ్జాయిగూడ	558	409
జజ్జువ	245	230
శంబం	833	486
ఆడలి	284	258
కిండంగి	229	215
తొత్తడి	276	231
పొంజాడ	265	249
గులుమూరు	328	253
కొండబొర్లంగి	158	136
జిల్లేడుపాడు	289	207
కోడిశ	1297	939
ముత్యాలు	404	295
కోతాం	205	177
దబర	661	502
కడగండి	429	323
చిన్నవంగర	184	173
పెదవంగర	158	141
సారంగి	480	416
ఓంద్రుజోల	204	181
గజిలి	438	409
లోకొత్తవలస	192	172

వీరఘట్టం పట్టణానికి మహర్దశ..!

- నగర పంచాయతీగా మారేందుకు సదావకాశం
- వీరఘట్టం అభివృద్ధిపై గతేడాది ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన ఎమ్మెల్యే కళావతి
- 1918లో 4 వేల జనాభాతో పంచాయతీగా ఏర్పడిన వీరఘట్టం పట్టణం
- మరలా 1971లో 12 వేల జనాభాతో మేజర్ పంచాయతీగా మారిన వైనం
- ప్రస్తుతం వీరఘట్టం పట్టణ జనాభా 20 వేలకు పైనే..



రోడ్ల విస్తరణ తర్వాత ఇటీవల నిర్మించిన వీరఘట్టం ప్రధాన రహదారి

వీరఘట్టం: రెండేళ్ల కిందట జరిగిన జిల్లాల పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో చేరిన వీరఘట్టం పట్టణం నేడు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అటు డివిజన్ కేంద్రం పాలకొండకు, జిల్లా కేంద్రం పార్వతీపురానికి మధ్యలో ఈ పట్టణం ఉండడంతో వీరఘట్టం మేజర్ పంచాయతీ భవిష్యత్‌లో నగర పంచాయతీగా మారేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయి. మరో పక్క వీరఘట్టం ఇరువైపులా రియల్ ఎస్టేట్స్ బాగా విస్తరిస్తున్నాయి. అంతేకాకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవతో రూ.5.50 కోట్లతో చేపట్టిన వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. అలాగే వీరఘట్టం – వంగర మండలాలను అనుసంధానం చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన కిమ్మి–రుషింగి వంతెన అందుబాటులోకి రావడంతో వంగర మండలంలోని 25 గ్రామాల ప్రజలు నిత్యం వీరఘట్టానికి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పట్టణంలో వ్యాపారాభివృద్ధి గణనీయంగా పెరిగింది. అంతేకాకుండా జియ్యమ్మవలస, వంగర, గరుగుబిల్లి, సీతంపేట, పాలకొండ మండలాల్లోని కొన్ని గ్రామాలకు వీరఘట్టం పట్టణం అన్ని విధాలుగా అందుబాటులో ఉండడంతో వీరఘట్టంలో వ్యాపారాలు జోరందుకున్నాయి. ఈ ప్రాంతాన్ని నగర పంచాయతీగా అభివృద్ధి చేస్తే ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గతేడాది ప్రభుత్వానికి నివేదిక కూడా ఇచ్చారు. ప్రభుత్వం చొరవ చూపితే వీరఘట్టం పట్టణానికి మహర్దశ పడుతుంది.



వీరఘట్టం మేజర్ పంచాయతీ కార్యాలయం

ఇదీ పరిస్థితి....

ప్రపంచ మల్లమార్తాండ, కళియుగ భీముడు కోడి రామ్మూర్తినాయుడు జన్మించిన గడ్డ వీరఘట్టం. బ్రిటిష్ కాలంలో 4 వేల జనాభాతో 1918లో వీరఘట్టం గ్రామం పంచాయతీగా ఆవిర్భవించింది. అనంతరం జనాభా పెరగడంతో 1971లో మేజర్ పంచాయతీగా ఏర్పడింది. ఈ సమయంలో జనాభా 12 వేలకు పైగానే ఉండేవారు. క్రమంగా జనాభా పెరుగుతూ ప్రస్తుతం 20 వేలకు చేరుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

– ఎంత జనాభా ఉండాలి....

వీరఘట్టం మేజర్ పంచాయతీ నగర పంచాయతీగా మారాలంటే పట్టణ జనాభా 25 వేల నుంచి 30 వేల వరకు ఉండాలని అధికారులు చెబుతున్నారు. మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాలు వీరఘట్టం మేజర్ పంచాయతీలో విలీనం అయితే పట్టణం నగరపంచాయతీగా మారే అవకాశాలున్నాయి. ప్రస్తుతం వీరఘట్టం సమీపంలో నడుకూరు, బూరుగ, విక్రమపురం, యు.వెంకమ్మపేట గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 8 వేలకు పైబడి జనాభా ఉన్నారు. ఈ గ్రామాలు వీరఘట్టంలో విలీనం అయితే భవిష్యత్‌లో నగర పంచాయతీగా మారే అవకాశం ఉంది.

అవకాశాలున్నాయి..



వీరఘట్టం మేజర్ పంచాయతీలో ప్రస్తుత జనాభా 20 వేల వరకు ఉన్నారు. ఈ పట్టణం భవిష్యత్‌లో నగర పంచాయతీగా మారే అవకాశాలున్నాయి. వీరఘట్టం సమీపంలో ఉన్న గ్రామాలు మేజర్ పంచాయతీలో విలీనం అయితే నగర పంచాయతీగా రూపాంతరం చెందుతుంది.

– ఎంవీబీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ, వీరఘట్టం

అభివృద్ధిపై దృష్టి సారించాం..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వీరఘట్టం పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించాం. గత ప్రభుత్వాలు ఓట్ల రాజకీయాలు చేసి వీరఘట్టం పట్టణం అభివృద్ధి చెందకుండా అడ్డుకున్నాయి. మేము గ్రామాభివృద్ధే లక్ష్యంగా చేసుకున్నాం. అందుకే రూ.5.50 కోట్ల నిధులతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టాం. వీరఘట్టానికి నగర పంచాయతీ అయ్యేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని భావించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం.

– విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్యే

● ఆ ఇళ్ల వయస్సు రెండున్నర శతాబ్దాలు

సీతానగరం: మండలంలోని పూర్వీకులు వరిఊక, పులబోసిన మట్టి(పొట్టు)తో కట్టిన పెంకుటిళ్లు ఇప్పటికీ చెక్కు చెదలేదంటే నిర్మాణంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నారో జయంతిరాయపురం అగ్రహారం ఇళ్లను చూస్తే అర్థమవుతుంది. ఈ మేరకు జయంతిరాయపురంలో సువర్ణముఖి నది ఒడ్డున ద్రావిడ బ్రాహ్మణ శాఖకు చెందిన కర్రా సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, గంటి సుబ్బారావు, కర్రా అప్పలనరింహులు కుటుంబాలకు చెందిన వారు 250 సంవత్సరాల క్రితం వరిపొట్టు, పులబోసిన మట్టి, పచ్చి ఇటుకలు, తోక పెంకులతో కూడిన పెంకుటిళ్ల ఇళ్ల నిర్మాణం చేశారు. సివిల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రులైన వారితో ప్లాన్ గీయించి ప్రస్తుత కాలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టినా వంద సంవత్సరాలు ఉంటాయో లేదోనని నిర్వాహకులకు అనుమానమే. అటువంటిది 250 సంవత్సరాల క్రితం నిర్మించిన ఇళ్లు చరిత్రపుటల్లో నిలిచిపోతాయనడానికి నిదర్శనం జయంతిరాయపురంలో పూర్వీకులు నిర్మించిన ఇళ్లు. ఆ పెంకుటిళ్లు 250 సంవత్సరాలుగా కుటుంబీకులకు నీడనిస్తున్నాయంటే ఆశ్చర్యంగా ఉంది. బ్రాహ్మణ కులస్తులు ఉద్యోగాలరీత్యా, వృత్తి రీత్యా పట్టణాలకు వెళ్లిపోవడంతో ఆ ఇళ్లను శుద్ధి చేసుకునేందుకు వేరేవారు నివాసం ఉంటున్నారు. ఆ ఇళ్ల యజమానులు పండగలకు, గ్రామ దేవత సంబరాలకు రావడం మూడు రోజులు ఇళ్లలో ఉండి ఉత్సవాలను చూసుకుని తిరిగి వెళ్తుంటారు. బ్రాహ్మణ కుటుంబంతో అనుబంధం ఉన్న గ్రామస్తుడు కేవీ రమణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ల్యాండ్‌లార్డ్‌గా పేరొందిన కర్రా అప్పలనరసింహులు కుటుంబసభ్యులు 250 సంవత్సరాల క్రితం నిర్మించిన పెంకుటిళ్లు ఇవి అని, కొద్దిగా మరమ్మతులకు గురైతే బాగు చేయించడం మినహా పెట్టుబడి లేదని చెప్పారు. ఇంతటి వయస్సున్న ఇళ్లు ఇప్పటికీ చెక్కు చెదరలేదంటే ఆశ్చర్యం కలగక మానదన్నారు. ఇటువంటి నిర్మాణాలు చరిత్రపుటల్లో నిలిచిపోతాయనడానికి నిదర్శనంగా ఈ ఇళ్లే కన్పిస్తున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.



జయంతిరాయపురంలో 250 సంవత్సరాల నాటి పెంకుటిల్లు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొండ రూరల్: పాలకొండ పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఆపరేషన్ల ఈఈ టీజీకే మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ టౌన్‌ఫీడర్, 11 కేవీ సీతంపేట ఫీడర్‌లో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. పట్టణంలోని ఎంఎం నగర్, శ్రీనివాస నగర్, ఎన్‌కే రాజపురం, సీఎల్ నాయుడునగర్, కోమటిపేట, దేవరపేట, వెంకంపేట, పెదకాపు వీధి, చిన్న కాపువీధి, శ్రీకాకుళం రోడ్, సీతంపేట రోడ్డు, వెలగవాడ, ఓని, విజయరాంపురం, పరుశురాంపురం, సిరికొండ, గదబవలస ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

● **భామినిలో..**

భామిని: మండలంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో పాలకొండ డివిజన్ ఈఈ గోపాలకృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

కురుపాం: ప్రతీ రైతు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభించాలని, అలా అయితే తక్కువ శ్రమతో అతితక్కువ సమయంలో పంట దిగుబడి సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసరాజు తెలిపారు. మండలంలోని గవరంపేట గ్రామంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థుల రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమానికి గురువారం హాజరైన ఆయన.. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్న సాగు సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. సరికొత్త కలుపుమందుల పట్ల అవగాహన పెంచుకోవాలని డాక్టర్ జ్యోతిబసు తెలిపారు. కొత్త వంగడాలను రైతులు పొలంలో వేసుకోవాలని డాక్టర్ స్రవంతి సలహా ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎంయూ షణ్ముఖరాజు మాట్లాడుతూ ప్రతీ రైతు వివిధ రకాల పంటలను 365 రోజులూ పండించుకోవచ్చని తెలిపారు. ఓ ప్రణాళికా ప్రకారం సాగు చేస్తే ఏకకాలంలో బహుళ పంటలను పండించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు చేతికి వస్తాయన్నారు. అనంతరం రైతులకు నవధాన్యాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యంనాయుడు, వ్యవసాయ కళాశాల, నైర విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం మేలు..



విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పాలకొండ రూరల్: వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా చేయకుండా పుస్తక పఠనం అలవర్చుకోవడంతో మేధస్సును పెంపొందించుకోవచ్చని పాలకొండ శాఖా గ్రంథాలయాధికారి బబ్బూరి గణేష్‌బాబు అన్నారు. గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం ద్వారా గురువారం పుస్తక పఠన ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఫ్యాషన్ డిజైన్‌పై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన బోధన

- ప్రిన్సిపాల్ హరగోపాల్



బెజ్జిలో అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, తదితరులు

పాలకొండ రూరల్: ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులచే మెరుగైన బోధన అందుతుందని స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హరగోపాల్ అన్నారు. పట్టణ పరిసర ప్రాంతాలైన తలవరం, నీలానగరం, తెట్టంగి, బెజ్జి, పారాపురం, తదితర గ్రామాల్లో సహచర అధ్యాపకులతో కలిసి గురువారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లో అందుతున్న సౌకర్యాలపై వివరించారు. కళాశాలలో ప్రత్యేక లేబరేటరీలు, ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా డిజిటల్ విద్య అందించడం, ఎంసెట్, నీట్, తదితర పోటీ పరీక్షలకు అందిస్తున్న శిక్షణ వంటి అంశాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు గోవిందరావు, వెలమల అప్పారావు, వెంకటేశ్వరరావు, శివానంద్, ఎం.శ్రీనివాసరావు, పీజీ శ్రీను, బీవీటీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన



పాలకొండ: ఓని గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ: జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా అన్నవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగీ సోకడానికి గల కారణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఓని గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కమలనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.



భామిని: ఏటంగూడలో దోమతెరల వాడకంపై అవగాహన చేస్తున్న వైద్య సిబ్బంది

దోమల నివారణతోనే డెంగీ నిర్మూలన

భామిని: దోమల నివారణతోనే ప్రమాదకర డెంగీని నిర్మూలించగలమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోషిలక్ష్మి తెలిపారు. డెంగీ నివారణ దిన సందర్భంగా పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

వర్షం నుంచి రక్షణ..



గురండిలో టార్పాలిన్ల రక్షణలో ధాన్యం బస్తాలు

భామిని: మండలంలో కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి నూర్పులు పూర్తవడంతో ధాన్యం బస్తాలను పొలాలు, కళ్లాల్లోనే ఉంచారు. అయితే కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ధాన్యం బస్తాల రక్షణలో తలమునకలై ఉన్నారు. టార్పాలిన్లు కప్పుతూ బస్తాలు తడవకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆరగించే ముందు.. ఆలోచించండి ప్లీజ్!



రసాయనాలతో మగ్గించిన మామిడి పండ్లు

గరుగుబిల్లి: వేసవి వచ్చిందంటే చాలు విరివిగా లభ్యమయ్యే మామిడి పండ్లను తినేందుకు ప్రజలు అత్యంత ఇష్టపడతారు. పసుపు, పచ్చ, కుంకుమ రంగుల్లో ఎంతో ఆకర్షణీయంగా తీయని రుచిని ఇచ్చే ఈ పండ్లను చిన్నవారి దగ్గర నుంచి పెద్దవారి వరకు ఆరగించేందుకు అందరూ ఆసక్తి చూపిస్తారు. పీచుపదార్థాలతో పాటు విటమిన్–ఎ, విటమిన్–సి ఉండే ఈ పండ్లు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. అయితే వీటిని తినేముందు కాస్త ఆలోచించండి అని వైద్య నిపుణులు, ఆరోగ్య సలహాలు సూచించే వారు చెబుతున్నారు. పసుపు రంగులో నిగనిగలాడే ఈ పండ్లను త్వరగా మగ్గబెట్టేందుకు(ముగ్గించేందుకు/పండినట్లు చేసేందుకు) వ్యాపారులు రసాయనాలు వాడుతున్నారు. ఇవి ఆరోగ్యానికి హానికరం. రసాయనాలతో మగ్గించిన పండ్లను తింటే నాడీవ్యవస్థ దెబ్బతినడంతో పాటు కేన్సర్ వంటి భయంకరమైన వ్యాధి బారినపడే అవకాశం ఉందంటున్నారు. సాధారణంగా గంపల్లో ఉంచిన మామిడి కాయలపై ఎండుగడ్డి ఉంచి, వారం రోజులు వేచి చూస్తే అవి పండ్లుగా మారుతాయి. ఇలా మగ్గిన పండ్లను తీసుకుంటే మంచిది. అయితే తక్కువ కాలంలో పక్వానికి రాని, వర్షానికి, గాలులకు దెబ్బ తిన్న కాయలను కూడా మగ్గించేందుకు వ్యాపారులు అత్యాశతో రసాయనాలు వాడి, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రతిఒక్కరూ పండ్లు కొనుగోలు చేసే ముందు, వాటిని తినేముందు కాస్త ఆలోచించాలని కోరుతున్నారు.